
ప్రజాశక్తి



అందని వైద్య సేవలు

ప్రజాశక్తి-వేపాడ

తమ సమస్యల పరిష్కారం కోసం పిహెచ్‌సి వైద్యులు సమ్మెబాట పట్టడంతో మండలంలోని పిహెచ్‌సిల్లో వైద్య సేవలు అందడం లేదు. వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోక పోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం బొద్దాం, వేపాడ పిహెచ్‌సిలకు వచ్చిన రోగులు, గర్భిణులు, బాలింతలు.. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.



బొద్దాం పిహెచ్‌సిలో వేచి ఉన్న రోగులు

ఆర్‌టిసిలో పని ఒత్తిడి

- కండక్టర్ల అకాల మరణాలు
- ఇప్పటికే ఇద్దరు మృతి
- ఓవర్ లోడ్.. టికెట్లు గందరగోళం
- 16 గంటల పాటు విధులు!
- దిక్కు తోచని స్థితిలో కుటుంబాలు
- అధికారుల ఒంటెద్దు పోకడలు



ప్రజా రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్‌టిసిలో పని ఒత్తిడి కండక్టర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించే డ్రైవర్లు, కండక్టర్ల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. పని ఒత్తిడితో కూడుకున్న వీరి ఉద్యోగం నిత్యం సవాలుగా మారుతోంది. ప్రభుత్వ విధానాలు, అధికారుల వేధింపులు, ఒంటెద్దు పోకడలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆ ఒత్తిడే వారి ప్రాణాలను తీసేస్తోంది. తాజాగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు కండక్టర్లు బస్సుల్లోనే గుండెపోటుతో మృతి చెందడం ఆర్‌టిసి ఉద్యోగులను కలవర పెడుతోంది.

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట డిపోల పరిధిలో 245 మంది కండక్టర్లు, 213 మంది డ్రైవర్లు, పార్వతీపురం జిల్లాలో కండక్టర్లు 350 మంది, డ్రైవర్లు 4వందల మంది వరకు ఉన్నారు. రెస్టాఫ్ డ్యూటీలో ఉదయం 8గంటలకు డ్యూటీకి హాజరైతే రాత్రి 8గంటల వరకు పని చేయాలి. మరుచటి రోజు వీరికి సెలవు ఉంటుంది. ఎవరైనా డ్యూటీకి హాజరు కాకపోతే అదనంగా డ్యూటీ చేయాల్సి వస్తుంది. మరోరకమైన డ్యూటీలో ఉదయం 5గంటలకు డ్యూటీలో చేరితే మధ్యాహం 1గంటకు దిగుతారు. వీరు మరుచటి రోజు డ్యూటీకి హాజరు కావాల్సి ఉంటుంది. అయితే ఆర్‌టిసి అధికారులు ఒత్తిడి ఓ వైపు..బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడం, తగినన్ని బస్సులు, సిబ్బంది లేకపోవడం మరోవైపు కండక్టర్లను, డ్రైవర్లకు ఒత్తిడికి గురిచేస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల కండక్టర్లు మహిళలకు ఫ్రీ టికెట్, పురుషులకు డబ్బులు తీసుకుని టిక్కెట్లు ఇవ్వాల్సి వస్తోంది. ప్రయాణికుల రద్దీతో కొన్ని సందర్భాల్లో ఒకరి టిక్కెట్ మరొకరికి మారిపోవడం, అధికారుల తనిఖీల్లో రిమార్కులు రాసేయడంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సస్పెన్షన్‌తో పాటుగా ఇంక్రిమెంట్లు పోవచ్చునని ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు ఎక్కువ టిక్కెట్లు కొడుతుండడంతో టిమ్స్ మిషన్లు ఛార్జింగ్ అయిపోయి ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్‌టిసి సంస్థ బస్సులను పెంచకపోగా, ఉన్న బస్సుల్లో కోత పెట్టింది. ఆర్టీసీలో గత ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం గాని సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. ఉన్న సిబ్బందిలో కొంతమంది రిటైర్డ్ కాగా, మరికొంతమంది సిక్‌లో ఉంటున్నారు. దీంతో ఉన్న సిబ్బందికి సెలవులు దొరకని పరిస్థితి నెలకొంది. కండక్టర్లకు, డ్రైవర్లకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ప్రజా రవాణా అధికారులు సెలవులు మంజూరు చేయడం లేదు. ఫలితంగా అనారోగ్యం తోనే ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈనేపథ్యంలోనే ఇటీవల ఇద్దరు కండక్టర్లు విధి నిర్వహణలోనే గుండెపోటుకు గురై మృతి చెందారు.

ఆరోగ్యం బాగోలేదని, సెలవు కావాలని సాలూరు డిపోకు చెందిన డి.దాసు అధికారులను అడిగారు. సెలవు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరయ్యారు. సాలూరు నుంచి విశాఖ వెళ్తుండగా రామభద్రపురం చేరుకునేసరికి బస్సులోనే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. ఈనెల 4న సాలూరు నుంచి విశాఖ వెళ్తున్న బస్సు రామభద్రపురం ఆర్‌టిసి కాంప్లెక్సు చేరుకునే సమయంలో కండక్టర్ డి.దాసు సీట్లోనే కుప్పకూలి గుండెపోటుతో మరణించారు. తనకు ఆరోగ్యం బాగోలేదని, సెలవు కావాలని సాలూరు డిపోకు చెందిన డి.దాసు అధికారులను అడిగారు. సెలవు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరయ్యారు. సాలూరు నుంచి విశాఖ వెళ్తుండగా రామభద్రపురం చేరుకునేసరికి బస్సులోనే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. అలాగే గతనెల 23న ఎస్.కోట డిపోకు చెందిన ఈశ్వరరావు అనే కండక్టర్ విశాఖ నుంచి తిరుగు ప్రయాణంలో ఉండగా గుండెపోటుతో మృతి చెందారు. వీరిద్దరి మృతికి పని ఒత్తిడే కారణమని తెలుస్తోంది.

పెరిగిన ఒత్తిడి

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి (ఉచిత బస్సు) పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. స్త్రీశక్తి పథకం అమలు కాకముందు వరకు బస్సులో సగటున 50 నుంచి 60 మంది వరకు ప్రయాణించగా, నేడు 80 నుంచి 90 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఫలితంగా ఆర్‌టిసిలో కండక్టర్లపై విపరీతమైన పని భారం పెరిగింది. ఈ కారణంగా జిల్లాలో ఇటీవల ఇద్దరు ఆర్టీసీ కండక్టర్లు గుండెపోటుతో మరణించారు.

పని ఒత్తిడితో ప్రాణాలు పోతున్నాయి



ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల సంఖ్య రెట్టింపు పెరిగింది. దీంతో బస్సుల్లో రెండు రకాల టిక్కెట్లు కొట్టడం, ఆ టిక్కెట్లు ఎక్కడ మారిపోతాయో అనే భయంతో కండక్టర్లు ఉన్నారు. 50 మంది ఎక్కాల్సిన బస్సులో వందమంది వరకు ఎక్కడంతో టికెట్లు కొట్టడం కూడా ఇబ్బంది అవుతుంది. బస్సు కదులుతుంటే ఈలోపు ఏదైనా స్టేజ్‌లో స్క్వాడ్ ఎక్కితే అప్పటికి టిక్కెట్లు కొట్టలేక పోతే కండక్టర్లలో టెన్షన్ పెరుగుతోంది. విపరీతమైన పని వత్తిడి, మానసిక ఆందోళన, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి భయంతో బస్ లోనే ప్రాణాలు పోతున్నాయి. మరిన్ని ప్రాణాలు పోకముందే అన్ని సంఘాలు, అసోసియేషన్‌లు ఈ విషయం లో ఐక్య కార్యాచరణ చేయాలి.

- వి.రాములు, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి

చిన్న తప్పులకు కూడా కేసులు బనాయింపు



స్త్రీ శక్తి పథకంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెట్టింపు అయ్యింది. టిమ్ ఛార్జీలు చాలక పోవడంతో ఆ బస్సును డ్యూటీ మధ్యలో ఆపలేక తీవ్రమైన ఒత్తిడి గురవుతున్నాం. దీనికి ప్రత్యేకమైన ఛార్జింగ్ మిషన్లు లేకపోవడంతో కండక్టర్లు ఏం చేయాలో పాల్పడక మానసికంగా ఒత్తిడి గురై ఇబ్బందులు పడుతున్నారు. స్క్వాడ్ చిన్న చిన్న తప్పులకు కూడా పాత విధానంగా కేసులు రాస్తున్నారు. ఇది ఉద్యోగుల్లో తీవ్రమైన ఒత్తిడికి గురై అకాల మరణానికి కారణమవుతున్నాయి. సిబ్బంది పట్ల అధికారుల ఏకపక్ష ధోరణి వీడాలి.

- పిజి రాఫెల్, ఎన్‌ఎంయు జిల్లా కార్యదర్శి

పండగ పేరుతో దండేశారు

- వేదిక కూలిన ఘటనపై గవర్నర్, సిఎస్‌కు ఫిర్యాదు చేస్తా
- మా మీద ఎందుకు అంత కక్ష?
- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో తాము కూర్చున్న వేదిక కూలిపోయిన ఘటనపై రాష్ట్ర గవర్నర్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం విజయనగరంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ కూడా ఉత్సవాలు అనేటప్పుడు రాజకీయాలు చేయరని, కానీ ఈఏడాది అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రమాణాలు పాటించ లేదని అన్నారు. సంప్రదాయాలను పక్కన పెట్టి అహంకారంతో పండగ చేశారన్నారు. రెవెన్యూ, ఎక్సైజ్, ఎంపిడిఒ, ఇలా అన్ని కార్యాలయాల్లోనూ హుండీ పెట్టి భారీగా డబ్బులు వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. దీనికి దీనికి కలెక్టర్, ఎస్‌పి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందా లేదా? అని ప్రశ్నించారు. సివిల్ సర్వెంట్లగా మీరు చేస్తున్నది ఇదేనా..? అని అన్నారు. తాను ప్రోగ్రాం షెడ్యూల్ ఇస్తే అవమానించారని అన్నారు. తాము కూర్చున్న వేదిక కూలిపోవడం కుట్రపూరితంగా జరిగిందా, అలసత్వంతో జరిగిందా అనేది తేలాల్సి ఉందన్నారు ఈఘటనలో ఇద్దరికి గాయలయ్యాయన్నారు. తమపై ఎందుకు అంత కక్ష అని, ఈ ఘటనపై గవర్నర్‌కు, సిఎస్‌కు లేఖ రాస్తామని తెలిపారు. ప్రభుత్వ అలసత్వమే దీనంతటికీ కారణమని అన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన పది కళాశాలలను పిపిపిలో ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. డబ్బులు లేవని పిపిపికి ఇస్తున్నామని చెబుతున్నారని, మరోవైపు వేల కోట్లు అప్పులు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఒక వసతిగృహం విద్యార్థులు అధిక సంఖ్యలో ఆస్పత్రి పాలవ్వడం ఎన్నడూ చూడలేదన్నారు. ఆరోగ్య శ్రీతో పాటు అన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలంతా దోచుకోవాలనే ఆలోచనతోనే మద్యం పాలసీని తీసుకొచ్చారని విమర్శించారు. ఇప్పటి వరకు కల్తీ లిక్కర్ తాగి ఐదుగురు చనిపోతే విచారణ లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ పి.సురేష్ బాబు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

గోవా రాష్ట్ర గవర్నర్ పి.అశోక్ గజపతిరాజును శుక్రవారం ఎస్‌పి ఎఆర్ దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారని, మునుపెన్నడు లేని విధంగా భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారని అన్నారు. పండుగను జయప్రదం చేసినందుకు ఎస్‌పితో పాటు పోలీసుశాఖను అభినందించారు.



గవర్నర్ అశోక్‌ను కలిసిన ఎస్‌పి దామోదర్

పత్తి రైతులు నష్టపోకుండా చూడాలి

జెసి సేతుమాధవన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి మాధవన్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఏ ఒక్క పత్తి రైతు నష్టపోకుండా చూడాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాదవన్ ఆదేశించారు. ప్రత్తి కొనుగోళ్లపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జేసీ చాంబర్ లో శుక్రవారం జరిగింది . ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి రైతు నష్టపోకుండా గిట్టుబాటుధరను అందించేలా చూడాలని ఆదేశించారు. ప్రతి ప్రత్తి రైతు ఈక్రాప్ కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం పత్తికి మద్దతుధర క్వింటా రూ. 8,110 గా నిర్ణయించిందని, ఈ విషయాన్ని సేవ కేంద్రాల ద్వారా విస్తతంగా ప్రచారం చేయాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి పంటను క్వింటా ఒక్కింటికి రూ.8,110 చొప్పున కొనుగోలు చేయడానికి, త్వరలోనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాటన్ కార్పొరేషన్ రూపొందించిన 'కాపాస్ కిసాన్' మొబైల్ యాప్ ను రైతులు ముందుగా డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ముందుగా రాజాంలో ఉన్న ఎఎంసి నుండి ప్రత్తి కొనుగోలు చేపట్టి, అక్కడి నుండి రామభద్రపురం లో ఉన్న జిన్నింగ్ మిల్లుకు తరలిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో మార్కెటింగ్ ఎడి బి.రవికిరణ్, వ్యవసాయ శాఖ ఎఒ ధనలక్ష్మి, డిఎఫ్ఒ రాంప్రకాష్, లీగల్ మెట్రాలజీ నుంచి పివి రంగారెడ్డి, ఎంవిఐ దుర్గాప్రసాద్, సిసిఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

భోగాపురంలో భూమాయ

రెవెన్యూ రికార్డులు తారుమారు!

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో భూముల రేట్లు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్న వేళ, అందరి చూపు భూములపైనే కేంద్రీకృతమైంది. బంధుత్వాలు, అనుబంధాలు అన్నీ పక్కన పెట్టి భూముల ఆక్రమణకు తెగబడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొంతమంది రెవిన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ వివాద స్పద భూములను ముట్టుకోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని తూర్పుఖండం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 280/1లో ఉన్న భూమి కీర్తిశేషులు కొమ్మూరు అప్పడుదొర పేరున ఉంది, కొంతకాలంగా ఆ భూమిని స్థానికంగా కొంతమంది సాగు చేసుకుంటూ వస్తున్నారు. అయితే వారికి ఆ



భూమి ఏ విధంగా దఖలు పడిందో వివరాలు లేవు. రికార్డులు సరిపోలకపోవడంతో పలుమార్లు ఆన్‌లైన్ చేయించేందుకు ప్రయత్నించినా రెవిన్యూశాఖ నుంచి సహకారం లభించలేదు. గత వారం అదే భూమి కొందరి పేర్లతో ఆన్‌లైన్ చేయడంతో గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. ఏ విధమైన పత్రాలు లేకపోయినా, రికార్డుల్లో అప్పడుదొర పేరు ఉన్నా, అప్పడుదొరకు, భూమి రికార్డులు ఆన్లైన్ చేయించుకున్న వారికి ఎటువంటి సంబంధం లేకపోయినా పేరుమార్పు జరగడంపై భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో చేర్చిన రెండు పేర్లతో పాటు కుటుంబంలోని మరొక సభ్యుడు వాటా చూపించకుండా మిగతా ఇద్దరే సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం బయట పడటంతో మూడో వాటాదారుడు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేయడంతో మొత్తం వ్యవహారం బయటపడింది. ముగ్గురం సాగు చేసుకుంటున్నామని ఆ విషయం చుట్టుపక్కల రైతులందరికీ తెలుసునని, కానీ రెవెన్యూ అధికారులు ఇద్దరు పేర్లే ఆన్లైన్ చేయడం అన్యాయమని మూడో వ్యక్తి తెలిపాడు. జరిగిన వ్యవహారంపై వివరణ తీసుకొనేందుకు ప్రజాశక్తి విలేకరి రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించినా అందుబాటులో అధికారులు ఎవరూ అందుబాటులో లేరు.

ఓటర్ల సవరణ దరఖాస్తులు 7 రోజుల్లో పరిష్కారం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఓటర్ల జాబితాలో సవరణకు వచ్చిన దరఖాస్తులు 7 రోజుల్లోగా పరిష్కారం కావాలని జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్ లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో క్లెయిమ్స్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి రోజు క్లెయిమ్స్‌పై ఎఇఆర్ఒ , బిఎల్ఒలతో మాట్లాడాలని, ఏ రోజు క్లెయిమ్స్ ఆ రోజే పరిష్కరిస్తే పెండింగ్ ఉండవని తెలిపారు. 7 రోజుల లోపల క్లెయిమ్స్ కోసం వచ్చిన దరఖాస్తులను ప్రాసెస్ చేయక పోతే సంబందిత ఇఆర్ఒ నుండి వివరణ కోరాలని ఎన్నికల కమిషన్ సూచించిందని తెలిపారు. సమావేశంలో నియోజక వర్గాల ఇఆర్ఒలు డిప్యూటీ కలెక్టర్లు నూక రాజు, ప్రమీలా గాంధీ, కళావతి, ఆశయ్య, రాంమోహన్ , ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు విని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను విన్నవించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

టిడిపిలో చేరికలు

విజయనగరం మండలం పినవేమలి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు నక్కాన శ్రీను, అలబోను సాధురావు, అలబోను నారాయుడు, అలబోను సింహాచలంతోపాటు సుమారు 35 కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే అదితి సమక్షంలో టిడిపిలో చేరారు. ముందుగా వైసిపి నాయకులకు, కార్యకర్తలకు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా పిన వేమలి గ్రామ టిడిపి నాయకులు కనకల రాంబాబు , సుంకరి చిన్న, మాజీ సర్పంచ్ సైలాడ గోవింద్, ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు పాల్గొన్నారు.

అనధికార బాణసంచా విక్రయాలు చేపట్టవద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అనధికారికంగా బాణాసంచా విక్రయాలు చేపట్ట రాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనధికారికంగా బాణాసంచా తయారీ గాని విక్రయాలు గాని చేపట్టడం నిషేధమని అన్నారు. కెఎల్ పురంలో లైసెన్స్ మంజూరైన హోల్‌సేల్ దుకాణాలు తప్పా మిగిలిన చిన్న చిన్న దుకాణాలు రిటైల్ షాపులు ఏర్పాటు చేయరాదన్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాయని చెప్పారు. లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డు ఎదురుగా ఉన్న సరస్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద తాత్కాలిక బాణాసంచా రిటైల్ విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారని అన్నారు. అక్కడ దుకాణాలు ఏర్పాటయితే వాటికి అవసరమైన తాత్కాలిక ట్రేడ్ లైసెన్సులను నగరపాలక సంస్థ అధికారులు మంజూరు చేస్తారన్నారు. న్యూపూర్ణ జంక్షన్ నుండి రాజీవ్ స్టేడియం వరకు గతంలో చిరు వ్యాపారులు తోపుడుబండ్లపై బాణాసంచా విక్రయించే వారిని. ఈసారి అటువంటి వ్యాపారాలను నిషేధిస్తున్నట్లు చెప్పారు.

సిజెఐపై దాడి హేయమైన చర్య

దాడికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - గజపతినగరం

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి గవాయ్‌పై దాడికి పాల్పడటం హేయమైన చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ ఖండించారు. బూట్ విసిరి మతోన్మాద దాడికి పాల్పడిన న్యాయవాది కిశోర్‌ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సిజెఐపై దాడికి వ్యతిరేకంగా గజపతినగరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలని కోరారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి దాడులు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో దాసరి సింహాద్రి, బి.కనకరాజు, బి.గోవింద, పి.కోటి, పి.పైడిరాజు, కృష్ణ, మహంకాళి, యేసు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

పూసపాటిరేగ, భోగాపురం : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిశోర్ దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ పూసపాటిరేగ మండలం కుమిలి సెంటర్‌లో, భోగాపురం మండలం ముక్కాం కూడలిలో సిపిఎం నాయకులు బి.సూర్యనారాయణ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిజెఐ గవాయ్‌పై దాడిని భారత న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మూకలు దళితులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడటం హేయమైన చర్యగా అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో రమణ, సంతు, కనకా రెడ్డి, శ్రీను, నాగరాజు, వై.అప్పారావు, బోనెల అప్పారావు, కోరాడ రాము, వెంకటరావు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: సిజెఐ గవాయ్‌పై దాడిపై లక్కవరపుకోటలో గాంధీ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సహకారంతోనే అరాచక మూకలు రెచ్చిపోతున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తరిణి వెంకటరమణ, ఆదిలక్ష్మి, రమణమ్మ, పద్మ, కొండమ్మ పాల్గొన్నారు.



లక్కవరపుకోట, పూసపాటిరేగలో నిరసనలు చేపడుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

పెన్షన్ వెలిడేషన్ చట్టం రద్దు చేయాలి

తపాల శాఖ కార్యాలయం వద్ద పెన్షనర్ల ధర్నా

విజయనగరం టౌన్ : పెన్షన్ వేలిడేషన్ చట్టం రద్దుచేయాలని, 8వ వేతన సంఘం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన తపాల శాఖ కార్యాలయం వద్ద పెన్షన్ దారులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పెన్షనర్లు అసిసియేషన్ నాయకులు నారాయణరావు మాట్లాడుతూ పెన్షన్ వెలిడేషన్ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చి పెన్షనర్ల ను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇంత వరకు 8 వేతన సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. ధర్నాలో శంకరనాయుడు, పెన్షనర్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ ప్రయోజనకరం

కలెక్టర్ రామసుందర్ రెడ్డి ● సంగీత కళాశాలలో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్గించే విధంగా జిఎస్టి శ్లాబులను ప్రభుత్వం సవరించిందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి చెప్పారు. జిఎస్‌టి తగ్గింపు ద్వారా ప్రజలకు మేలు చేసే ఉద్దేశంతో ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో వాణిజ్య పన్నులశాఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రదర్శన, విక్రయాలను శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పలు సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేసి, జిఎస్టి తగ్గింపు ప్రయోజనాలను అందిస్తున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినియోగదారులకు ప్రయోజనం కల్గించే విధంగా 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబు పరిధిలోకి చేర్చారని, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలను 18 శాతం పరిధిలోకి తెచ్చారని, ఆరోగ్యభీమాపై పన్నును పూర్తిగా తొలగించారని తెలిపారు. గ్రామాలు నుంచి జిల్లా వరకు అన్ని స్థాయిల్లో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని తెలిపారు. ఇంటింటి ప్రచార కార్యక్రమాలతోపాటు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు వద్ద కూడా ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిఎస్‌టి జాయింట్ కమిషనర్ జి.నిర్మలాజ్యోతి, సహాయ కమిషనర్లు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి కాపుగంటి ప్రకాష్ తదితర ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపల్ ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు.




స్టాల్స్‌లో వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని తపాలాశాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 6 తేదీ నుంచి 12 తేదీ వరకు తపాల శాఖ వారోత్సవాలు జిల్లాలో 343 తపాల శాఖ కార్యాలయాల్లో జరుగుతున్నాయని, ఈ సందర్భంగా ప్రజలకు తపాల శాఖ అందిస్తున్న సేవలు పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా 6న టెక్నాలజీ డే గా నిర్వహించామన్నారు. 7న ఫైనాన్సియల్ ఇంప్రూవ్‌మెంట్ పేరుతో కార్యక్రమాలు చేపట్టామన్నారు. అత్యధిక వడ్డీతో ఇస్తున్న సేవింగ్స్ ఖాతాలు గురించి ప్రజలకు తెలియజేశామన్నారు. 16 తపాల శాఖ కార్యాలయాల్లో ఆధార్ సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పిఎల్ఐ, అర్‌పిఐ స్కీమ్ లో అధిక బోనస్ లు ఇవ్వడం వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలికలకు సుకన్య, బాలురకు పిపిఎఫ్ స్కీమ్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తపాల శాఖ అందిస్తున్న సేవలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా వారోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం అసిస్టెంట్ సూపరిండెంట్ జివి రమణతో కలిసి వారోత్సవాలు బ్రోచర్లను విడుదల చేశారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్

ఎరువుల కోసం ఫోన్ చేస్తే బ్లాక్ లిస్టులో పెడతారా?

ఎడిఎపై ఎంపిపి, వైస్ ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఎరువుల సమస్యపై వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్ చేస్తే తమ నెంబర్లను ఎడిఎ నిర్మల జ్యోతి బ్లాక్ లిస్టులో పెట్టడం సరైనదికాదని ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో వారు శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. మండలానికి వ్యవసాయ పరికరాలు, ఎరువుల సమస్య తీవ్రంగా ఉందని, ఎడిఎకు ఫోన్ చేస్తే బిజీగా ఉన్నానని, తనకు ఫోన్ చేయవద్దని ఎడిఎ అనడం సరికాదని అన్నారు. మండల ప్రజా ప్రతినిధులు ఫోన్ చేస్తే ఎత్తకపోతే సామాన్య రైతుల సమస్యలు అసలు పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కె.కృష్ణాపురం రైతు సేవా కేంద్రం నుండి చౌడువాడవలస గ్రామానికి 120 యూరియా బస్తాలు తీసుకువచ్చి 105 బస్తాలు రైతులకు పంపిణీ చేశారని, మిగతా 15 బస్తాలు యూరియా పక్కదారి పట్టిందని అన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ జెడి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో వైసిపి రైతు విభాగం అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, వైసిపి నాయకులు చప్ప సత్యనారాయణ, రెడ్డి సింహాచలం, జమ్ము నారాయణరావు పాల్గొన్నారు.

బోధనేతర పనులు బహిష్కరిస్తాం

ఫ్యాప్టో ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మితిమీరిన బోధనేతర విధుల వల్ల బోధనా సమయం హరించిపోతోందని, దీంతో బోధనేతర పనులు బహిష్కరిస్తున్నామని ప్రకటిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఇఒ పెంటయ్యకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు ప్రసన్నకుమార్, జెసి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోతుందని, కేవలం బోధనకే పరిమితం చేస్తే నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. అందుకే శుక్రవారం నుంచి బోధనేతర, విద్యాశాఖ కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బొప్పె రవికుమార్, ఉపాధ్యాయులు శర్మ, గణేష్, అప్పారావు, శ్రీనివాసరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ కార్మికుల సేవలతోనే మున్సిపాలిటీకి మంచి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు, కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి మున్సిపల్ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రం చేశారని చెప్పారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం వల్లే రాష్ట్రస్థాయిలో మున్సిపాలిటీకి మొదటి అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులతో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రాంబార్కి శరత్ బాబు, కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ

ప్రజాశక్తి-బొబ్బిలి

సాంకేతిక రంగంలో ఇండియా ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు అన్నారు. బొబ్బిలి రాజా కళాశాలలో ఇస్రో ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో అమెరికాకు ధీటుగా పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సాంకేతిక రంగంలోనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. షార్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇస్రో చేస్తున్న పరిశోధనల ద్వారా ప్రపంచానికి ఇండియా స్థానం ఏమిటో తెలుస్తున్నదన్నారు. విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.



ఎస్కెఎంఎల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎస్కెఎంఎల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో నూతనంగా నిర్మించిన ఎస్కెఎంఎల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మొదటిసారిగా చిన్నపిల్లలు, బాలింతలకు అత్యాధునిక వైద్య పరికరాలు, సౌకర్యాలు కలిగిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు సోమశేఖర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో తక్కువ ధరలకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ జెడ్పి చైర్పర్సన్ శోభా స్వాతిరాణి, ఇందుకూరి అశోక్ మాస్టారు, శ్రీను రాజు, బుగత వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

జిఎస్టి తగ్గింపుతో ఉపయోగం

ప్రజాశక్తి-గంట్యాడ

జిఎస్టి తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పిఎసిఎస్ అధ్యక్షులు గోపిశెట్టి శంకర్రావు అన్నారు. గురువారం బోనంగి ఆరోగ్య ఉప కేంద్రంలో ఏర్పాటుచేసిన జిఎస్టి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో హెచ్ఎ డి.ఈశ్వరరావు, ఎంఎల్హెచ్పి హరీష్, ఇఒ రాజ్, హెచ్ఎస్ తిరుపతి, రవి, వెంకటలక్ష్మి, భాగ్య, ఆశా వర్కర్లు దుర్గాదేవి, లక్ష్మి, ఫాతిమా, ఇందిర పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-రేగిడి

తహశీల్దార్ కృష్ణలత కుమార్తె వై.లక్ష్మీచతుర్థి పదో తరగతి ఫలితాల్లో 595 మార్కులు సాధించి, ప్రతిభ కనబరిచింది. ఆమెకు దేవాడ వాసవి క్లబ్ అధ్యక్షులు కొల్ల సాయికిశోర్, శ్రీచైతన్య కళాశాల ప్రతినిధి వాసుబాబు రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని శుక్రవారం అందించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కూసుమంచి వెంకటరావు, రీజనల్ చైర్మన్ హనుమాన్ శెట్టి సన్యాసిరావు, దేవాడ మెగా అధ్యక్షులు విన్నకోట మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

13న ఐటిఐలో అప్రెంటీస్ మేళా

విజయనగరంకోట : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 13న నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఐటిఐ పాసైనా వారు ఈ అప్రెంటిస్ షిప్ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. మ్యాట్రిక్స్ లేబొరేటరీ, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటేడ్, జయభేరి ఆటోమోటివ్ లిమిటెడ్ , శ్యాంసంగ్ ఆథరైజ్డ్ సర్విస్ సెంటర్, ఐఎఫ్బి సర్వీస్ సెంటర్, వోల్టాస్ ఆథరైజెడ్ సర్విస్ సెంటర్, ఎల్జి, ప్రీమియం ఎనర్జీస్, క్యూస్షన్ టెక్నాలజీ హైదరాబాద్ తదితర ప్రముఖ కంపెనీలు అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 2 ఫొటోలతో రావాలని కోరారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

కంటోన్మెంట్ : పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పి ఎఆర్ దామోదర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే' నిర్వహించారు. సిబ్బందిని తన ఛాంబర్లోకి పిలిచి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

తెర్లాం : మండలంలోని పెరుమాలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ అపర్ణ మాట్లాడుతూ గుడ్టచ్ – బ్యాడ్టచ్, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై వ్యాసరచన పోటీలు, రన్నింగ్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అపర్ణ, పిఇటి సింహాచలం, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, సునీత, రమణి పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

వైసిపి ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణమని ఎమ్మెల్సీ పి.సురేష్బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం మండలంలోని రామతీర్థంలో వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు ప్రభుత్వ వైద్యవిద్య అందించడానికి 17 మెడికల్ కళాశాలలు నిర్మించి, కొన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీల మీద ఎంత ప్రేమ ఉందో ఈ ప్రయివేటీకరణ ద్వారా అర్థమైందన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైసిపి యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బడుకొండ ప్రదీప్ నాయుడు, ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, నాయకులు డి.జోగి జగన్నాథరాజు, పతివాడ సత్యనారాయణ, రేగాన శ్రీనివాసరావు, సముద్రపు రామారావు, కాంచరాపు రాము తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్ను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కొత్తవలసలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ పర్యటనలో విశాఖ ఎయిర్పోర్టు నుంచి నర్సీపట్నం వరకు పోలీసులు ఆంక్షలు పెట్టిన వాటిని ప్రజలు అధిగమించి భారీగా తరలివచ్చారని తెలిపారు. ప్రజలందరూ జగన్మోహన్ రెడ్డితోనే ఉన్నారని చెప్పేందుకు ఈ పర్యటన నిదర్శనమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గొరపల్లి శివ, ఎంపిపి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు వబ్బిన నాయుడు, బొంతల వెంకటరావు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్ఛార్జి యడ్ల కిశోర్, కొట్యాడ శ్రీనివాసరావు, చిన్నపాలెం పవన్, బిఎస్ఎన్ పాత్రుడు, జి.శివ పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. సంతకాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ సురేష్బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ ; కొత్తవలస.. పోస్టర్ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి



రౌండ్టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వైద్య కళాశాలలను

ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

రౌండ్టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాలు డిమాండ్

ప్రజాశక్తి -బొబ్బిలి

ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలను కొనసాగించాలని ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్జిఒ హోమ్ లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు పి. శివానంద్ మాట్లాడుతూ వైద్య రంగం నుంచి తప్పుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు కె. విజయగౌరి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్య ను దూరం చేసే ఈ చర్యను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోనే ఆరోగ్యం, వైద్య విద్య ఉండాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే పూర్తి చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకాడమీక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. వైద్య కళాశాలలు ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి. ధనంజయ్, డి. వెంకటనాయుడు అన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, మెడికల్ కాలేజీ లోను ప్రైవేటు పరం చేసే నిర్ణయం రద్దుచేయాలని తీర్మానం చేశారు.

సిఎంను కలిసిన బంగార్రాజు

ప్రజాశక్తి-భోగాపురం

సిఎం చంద్రబాబును శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్క్ఫెడ్కు సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం. రైతులకు మరింత మేలు చేకూరేలా మార్క్ఫెడ్ కార్యకలాపాలను విస్తరింప చేయాలని సిఎం సూచించారని బంగార్రాజు తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై కూడా ముఖ్యమంత్రికి వివరాలు అందజేసినట్లు వెల్లడించారు.

అంబేద్కర్ను అవమానిస్తే సహించం

ఎమ్మెల్సీ గ్రీష్మ

ప్రజాశక్తి-సంతకవిటి

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ను అవమానిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ఒక ప్రకటనలో హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహంపై దాడి అంటే... దళిత గౌరవంపై దాడిగా అభిప్రాయ పడ్డారు. వైసిపి నేతలు చిత్తూరు జిల్లా దవళంపేటలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించారంటూ మండిపడ్డారు. అంబేద్కర్ భావజాలం భావితరాలకు అందజేయాలన్న సంకల్పంతో విగ్రహాలను ఊరూరా నెలకొల్పుతున్నామని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం దళితులను అవమానించడమేనని పేర్కొన్నారు. జగన్ రెడ్డి పాలనలో దళితులపై దాడులు, హత్యలు, వారికి అవమానాలు జరిగాయని ఆరోపించారు. జగన్ రెడ్డి దళితుల మధ్య చిచ్చు పెట్టి కుట్ర రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు.

కొండగుంపాం విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొండగుంపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు విశాఖలోని జంతు ప్రదర్శన శాలలో వైల్డ్లైఫ్ వీక్ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో సత్తాచాటారు. ప్రతిభ కనబరిచిన పతివాడ షర్మిల, పతివాడ మేఘనను హెచ్ఎం ఎం.వి.వేణుగోపాలరావు అభినందించారు.

విజేతలు వీరే..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలను డిఇఒ యు.మాణిక్యం నాయుడు శుక్రవారం ప్రకటించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14న పాఠశాల స్థాయిలో, 8న మండల స్థాయి, 9న జిల్లా స్థాయిలో పోటీలు మూడు విభాగాల్లో నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో డ్రాయింగ్లో ఎం.ఇందుమతి (ఉద్దవోలు జెడ్పి హైస్కూలు) ఎం.మేఘన (కొత్తవలస), ఎం.హారిక (భోగాపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వ్యాసరచన పోటీల్లో డి.శిరీష (భోగాపురం), ఎ.రిషిత (జామి), కె.అనసూయ (డోలపేట) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వంలో డి.సిజల్ (వేపాడ), ఎ.జాహ్నవి (గజపతినగరం), ఎస్.ఉజ్వల (పెదమానాపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి రూ.5000, 3000,2000 నగదు బహుమతి అందజేయనున్నట్లు డిఇఒ తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంపై, గుడ్ టచ్ బ్యాడ్ టచ్పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ శ్రీవల్లి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యవతి, అరుణశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు, వల్లంపూడి ఎంఎస్ కె.దమయంతి పాల్గొన్నారు.

ఎస్.కోటలో 17న మహాధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్సి, ఎస్టి హక్కుల సాధనకు ఈ నెల 17న శృంగవరపుకోటలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నామని దళిత సంఘాల నాయకులు ఆతవ ఉదయ భాస్కర్, పి.సూరిబాబులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పోతనాపల్లి గ్రామంలో మహాధర్నా వాల్పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇబ్రహీంపురం ఎస్సి రిజర్వేషన్లు, అట్రాసిటీ చట్టంలో 41 సెక్షన్ రద్దు చేయాలని, ఎస్సి రిజర్వేషను 25 శాతానికి పెంచాలని, బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో ఈ ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బోనెల ఈశ్వరరావు, ఎద్దు సూర్యారావు, మొయ్యి దేవ, కొంకి రాంబాబు, మొయ్యి వెంకటరమణ, తెరువల్లి భాగ్యం, గణేష్, కొండమ్మ పాల్గొన్నారు.

బిఆర్పురంలో పొలంబడి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని భూపాలరాజపురంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పొలంలో కనిపిస్తున్న శత్రు, మిత్ర పురుగులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఐపిఎం కిట్లు, ఇన్సెక్ట్ నట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, వ్యవసాయ సిబ్బంది లక్ష్మి పార్వతి, కూర్మారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనులు, చెట్టుకొమ్మలు తొలగించడానికి నెల్లిమర్ల సబ్స్టేషన్ పరిధిలోని సారిపల్లితోపాటు వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీరందించని ప్రాజెక్టు ఎందుకు?

మండల సమావేశంలో సర్పంచులు ధ్వజం

ప్రజాశక్తి-చీపురుపల్లి

'తాగు నీరందించని ప్రాజెక్టు ఎందుకు? దానిని మూసేయండి. మా బాధలేవో మేము పడతాం. స్థానికంగా ఉన్న బోర్ల ద్వారానే ప్రజలకు నీరందిస్తాం. అంతే తప్ప సమావేశాలు జరిగేటప్పుడు ప్రజా ప్రతినిధులను మభ్యపెట్టడం తగద'ంటూ గొల్లలములగాం, ఇటకర్లపల్లి సర్పంచులు కరిమజ్జి శ్రీనివాసరావు, మీసాల వెంకటరమణ, మెట్టపల్లి ఎంపిటిసి మీసాల ఈశ్వరరావు.. అధికారులపై ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆర్డబ్ల్యుఎస్ జెఇ మాట్లాడుతుండగా, సర్పంచులు స్పందిస్తూ తమ గ్రామాలకు సుజలధార ద్వారా తాగు నీరందడం లేదని ఎన్ని సమావేశాల్లో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు తామేమి సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. ఇటకర్లపల్లి సర్పంచ్ మాట్లాడుతూ తాగునీటి పైపులైన్లు లీకవుతున్నాయని చెబుతున్నా అధికారులెవరూ స్పందించడం లేదని ప్రశ్నించారు. గొల్లములగాంలో టిడిపి కార్యకర్త రేషన్ డిపో నడుపుతున్నాడని, దీనిపై ఎన్నిసార్లు పౌర సరఫరాల, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో చాలా మందికి రేషన్ కార్డులు పంపిణీ చేయలేదన్నారు. తహశీల్దార్ ధర్మరాజు స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఖరీఫ్లో రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందజేశామని ఎఒ సూర్యకుమారి చెప్పడంతో సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యులు ఒక్కసారిగా లేచి అసలు ఏ ఊరికి సరిపడా యూరియా, విత్తనాలు అందజేశారో లెక్కలతో చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియా సరిగా అందకపోవడంతో జొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.

రామలింగాపురం, సుమిత్రాపురం, పుర్రాయవలస గ్రామాల్లో రీ సర్వే కారణంగా భూములకు సంబంధించి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య త్వరగా పరిష్కరించాలని రామలింగాపురం పిఎసిఎస్ పర్సన్ ఇన్ఛార్జి ఇప్పిలి సురేష్ అధికారులను కోరారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ రేగాన రామారావు, జెడ్పిటిసి వలిరెడ్డి శిరీషా, వైస్ ఎంపిపి కరిమజ్జి రమణమ్మ, ఎంపిడిఒ ఐ.సురేష్, తహశీల్దార్ డి.ధర్మరాజు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి వెంకటనర్సమ్మ

విస్తృతంగా అన్న క్యాంటీన్ సేవలు

అదనంగా షెడ్లు ఏర్పాటు : కమిషనర్



అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న జనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అన్నార్తుల ఆకలి తీర్చే కేంద్రాలుగా అన్న క్యాంటీన్లు సేవలు మరింత మెరుగుపరిచేందుకు నగర పాలక సంస్థ చర్యలు చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ అన్న క్యాంటీన్లు నగరంలో మూడు చోట్ల ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, ఘోషాసుపత్రి, నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో వీటిని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను నగరపాలక సంస్థకు అప్పగించారు. దీంతో కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రత్యేక శ్రద్ధ కనపరిచి అన్న క్యాంటీన్ల ఔన్నత్యాన్ని మరింతగా పెంచేదిశగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజు ఉదయం అన్న క్యాంటీన్లను సందర్శించడం, అనునిత్యం వాటిపై పర్యవేక్షణ ఉండేలా చొరవ చూపుతున్నారు. ప్రధానంగా పేదలకు పట్టెడన్నాన్నే కాదు అల్పాహారాన్ని కూడా పరిశుభ్రతతో అందిస్తున్నారు. అంతేకాదు అన్న క్యాంటీన్లు పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఎక్కడా లేనివిధంగా భోజనశాలలను విస్తరించడమే కాకుండా చుట్టూ షెడ్లు నిర్మించి ప్రశాంతంగా భోజనాలు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. భోజనంతో పాటు పేదలకు శుద్ధ జలం అందిస్తున్నారు.ఎప్పటికప్పుడు ఆర్ఒ వాటర్ ప్లాంట్ సిస్టంలను కమిషనర్ పి.నల్లనయ్య పర్యవేక్షిస్తున్నారు. వేడివేడి ఆహార పదార్థాలు అందుతున్నాయా లేదా అన్న విషయాలను ప్రజల నుండి అడిగి తెలుసుకుంటున్నారు ప్రతిరోజు 3 అన్న క్యాంటీన్లలో 1500 మంది వరకు అల్పాహారాన్ని, 1700 మంది వరకు మధ్యాహ్నం భోజనాన్ని, 800 మంది వరకు రాత్రి భోజనాన్ని స్వీకరిస్తున్నారు. బోజనాలు చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అదనంగా షెడ్లు వేసి, కూర్చొని బోజనం చేసే విధంగా బల్లలు కూడా ఏర్పాటు చేశారు. అన్నా క్యాంటీన్లు నిర్వహణ పట్ల భోజనాలకు వచ్చే వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న పెదమానాపురం గ్రామస్తులు

రహదారి సౌకర్యం కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

పెదమానాపురం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని జెడ్పిటిసి రౌతు రాజేశ్వరి ఆధ్వర్యాన గ్రామస్తులు పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ ఆర్ఒబి నిర్మాణం పూర్తవడంతో రైల్వే గేటును మూసేశారని, దీంతో ప్రజలకు వెళ్లడానికి రహదారి లేక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. కనీసం బస్సు కోసం వెళ్లాలన్నా రెండు కిలోమీటర్లు దాటి వెళ్లాలని చెప్పారు. అక్కడ బస్టాప్ బోర్డు కూడా లేదని ఆర్టిసి డ్రైవర్లు బస్సులు కూడా ఆపడం లేదని తెలిపారు. రాత్రి సమయంలో బస్సు దిగి ఊర్లోకి రావాలంటే నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తమ గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో న్యాయం జరుగుతుందని ఇంతవరకూ ఎదురుచూశామని తెలిపారు. తమ గ్రామానికి మంత్రి సైతం న్యాయం చేయకపోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మి, గ్రామ పెద్దలు మంగమ్మ, కనకరాజు, రామ, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-కొత్తవలస

వరి పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ ఏర్పాటుచేశారు. పంట కోత ప్రయోగం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ఎఎస్ఒ రాజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కెవి రామ్ ప్రసాద్, డిఎస్ఒ ఎల్వి రామచంద్రరావు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలోని రైతు సేవా కేంద్రం వద్ద తహసిల్దార్ రత్న కుమార్ అధ్యక్షతన వివిఎలు, విఆర్ఒలకు పంట కోత ప్రయోగాలపై, ఇ-పంట నమోదుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ కిరణ్ కుమార్, ఎఎస్ఒ ధనలక్ష్మి, ఎఇఒ సతీష్ పాల్గొన్నారు.

తెర్లాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై విఆర్ఒలు, విఎఎలకు తహశీల్దార్ జి.హేమంత్ కుమార్ అధ్యక్షతన ఎఎస్ఒ యు.సురేష్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ బి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఎం.అప్పలనాయుడు, ఎంఆర్ఐ ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

డ్రోన్లతో కషాయాల పిచికారీ

సంతకవిటి : మండలంలోని మామిడిపల్లి, మండవకురిటి పంచాయతీ పరిధిలో డ్రోన్ ద్వారా 50 ఎకరాల విస్తీర్ణంలో కషాయాలను శుక్రవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం డిపిఎం ఆనందరావు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా కషాయాలు పిచికారీ చేయడం వల్ల రైతుకు సమయం ఆదా అవుతుందని, ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పద్మావతి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం

కంటోన్మెంట్ : శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వ్యాధిగ్రస్తులు- ఉచిత న్యాయ సహాయం అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. మానసిక అనారోగ్యం, ఇతర వైకల్యాలు ఉన్న వ్యక్తులు కేసు దాఖలు చేయడానికి లేదా వాదించడానికి ఉచిత న్యాయ సేవలను పొందేందుకు అర్హులని తెలిపారు. ఎటువంటి న్యాయపరమైన అవసరాలు ఉన్నా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా న్యాయ సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ దేవిమాధవి, ఆసుపత్రి సూపరిండెంట్ ఎ.పద్మజ, డాక్టర్ కె.శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని పాత శ్రీరంగరాజుపురం గ్రామానికి చెందిన దుక్క ఎరుకరాజు (52) అదృశ్యమయ్యాడు. సెప్టెంబర్ మూడో తేదిన ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి డ్యూటీ నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు ఆయన భార్య రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని పుర్రేయవలస ప్రధాన రహదారి సమీపంలోని నేలబావిలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఎలకల రాము (26) మృతదేహం లభ్యమైంది. పత్తికాయవలస గ్రామానికి చెందిన రాము పుర్రేయవలస సమీపంలో ఇటుకలు తయారు చేసే కర్మాగారంలో పొక్లెయినర్ ఆపరేటర్గా పని చేస్తున్నాడు. కుటుంబంలో వ్యక్తులు అంగవైకల్యం కలిగి ఉండడం పోషణ భారమంతా రాముపైనే ఉండేది. కుటుంబ భారం, బాధ్యతలు కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ నెల 8 నుంచి కనిపించకపోవడంతో రాము తండ్రి ఎలకల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఎస్ఐ ఎల్.దామోదర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొట్లాట ఘటనలో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-కొత్తవలస

మండల కేంద్రంలోని సిమెంట్ వీధి ఈనెల 7న ఇద్దరు యువకులు సూరిశెట్టి రవితేజ జంగంపల్లి ప్రసాదు మద్యం సేవించి ఆ మత్తులో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ దాడిలో సూరిశెట్టి రవితేజ కూరగాయలు కోసుకునే కత్తితో ప్రసాద్పై దాడి చేయడంతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సూరిశెట్టి రవితేజను ఎస్ఐ సిహెచ్ షణ్ముఖరావు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు.

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి భవ్య

తండ్రిని హత్య చేసిన కుమారుడు అరెస్టు

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి మండల కేంద్రంలో తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడైన కుమారుడు లక్ష్మణరావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మండలంలో సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఈమేరకు స్థానిక పోలీసుస్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బొబ్బిలి డిఎస్పి భవ్య ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మద్యానికి బానిసైన లక్ష్మణరావు తరచూ తండ్రిని డబ్బులు అడగడం, ఇవ్వకపోతే గొడవపడడం చేసేవాడని తెలిపారు. డబ్బులు ఇవ్వలేదనే కోపంతో రాడ్డుతో గట్టిగా కొట్టడంతో తండ్రి రాజేశ్వరరావు మృతి చెందాడని తెలిపారు. నిందితుడిని పిన్నవలస జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించామని తెలిపారు. సమావేశంలో సిఐ నారాయణరావు, ఎస్ఐ తారకేశ్వరవు పాల్గొన్నారు.